సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం | 26 | సెప్టెంబర్ | 2023



ఫిర్యాదిదారులకు సత్వర న్యాయం అందించాలి

'స్పందన' ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించాలని ఎస్పీ బి.క్రిష్ణా రావు అధికారులను ఆదేశించారు. - 8లో



నిరంతర పర్యవేక్షణ...ప్రజలకు రక్షణ

కడపలో పోలీసు శాఖ తరపున ఏర్పాటు చేసిన కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థ సత్ఫలితాలు ఇస్తోంది. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఈ వ్యవస్థను రూపొందించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.132
రెండోరకం	రూ.66	రూ.98

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 402 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

27న 'జగనన్నకు చెబుదాం'

నందలూరు (రాజంపేట): ఈనెల 27వ తేదీన ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి తెలిపారు.సోమవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, అధికారులు పాల్గొంటారని చెప్పారు. ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మండల కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఇన్‌స్టంట్ ఫలితాలు విడుదల



ఆచార్య రఘుబాబుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షా ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డితో కలిసి విడుదల చేశారు. సోమవారం విశ్వవిద్యాలయంలోని వీసీ చాంబర్‌లో పరీక్షా ఫలితాల సందర్భంగా గణాంకాలను వీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పీజీసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు వీలుగా పరీక్షా ఫలితాలను త్వరితగతిన విడుదల చేసినట్లు తెలిపారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ సీబీసీఎస్ ప్యాట్రన్‌లో జరిగిన బీఏ, బీకాం, బీఎస్సీ ఇన్‌స్టంట్ పరీక్షలకు 2,986 మంది విద్యార్థులు హాజరుకాగా 2,864 (97.15 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని, 84 మంది పరీక్ష తప్పారని వివరించారు. కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారి డా. సుమిత్ర పాల్గొన్నారు.

సీడీసీ డీన్‌గా రఘుబాబు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం కళాశాల అభివృద్ధి మండలి (సీడీసీ) డీన్‌గా జియాలజీ విభాగం ఆచార్యులు డా. కె. రఘుబాబు నియమితులయ్యారు. సోమవారం వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఇప్పటి వరకు ఆ బాధ్యతలు నిర్వహించిన ఆచార్య వై. సుబ్బరాయుడు పదవీకాలం పూర్తవడంతో ఆయన స్థానంలో ఈయన్ను నియమించారు.కార్యక్రమంలో ఆచార్య వై. సుబ్బరాయుడు పాల్గొన్నారు.

బుడ్డశనగలు మంజూరు

కడప అగ్రికల్చర్: వైఎస్సార్‌జిల్లాకు రబీసీజన్‌కు సంబంధించి 74,120 క్వింటాళ్ల బుడ్డశనగలు మంజూరైనట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. వీటిని 40 శాతం రాయితీతో అందిస్తామని చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. విత్తనాల ధరలకు సంబంధించి క్వింటా పూర్తి ధర రూ. 8100 ఉంటే సబ్సిడీ రూ. 3240 పోను రైతు వాటా కింద రూ. 4860 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 20 కేజీల బస్తా ఒక రైతుకు ఒక ఎకరాకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

అంధ విద్యార్థి ప్రతిభ

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో కడప ప్రభుత్వ అంధుల పాఠశాలకు చెందిన శర్వానందరెడ్డి స్పెషల్ కేటగిరీల్లో ప్రతిభను చాటాడు. సోమవారం విజయవాడ పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో చిరుధాన్యాలు పౌష్టికాహారమా లేక ఆహార వ్యామోహమా అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో అంధ విద్యార్థి శర్వనందరెడ్డి పోస్టర్లు, చార్ట్, పీపీటీలను ప్రదర్శించాడు. దీంతో రాష్ట్రస్థాయిలో ప్రత్యేక కోటాలో కన్సోలేషన్ బహుమతిని కైవసం చేసుకున్నాడు. రాష్ట్ర ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర సైన్స్ ఆఫీసర్ బాగ్యశ్రీ శర్వానందరెడ్డి, గైడ్ టీచర్ వేపరాల ఎబినైజర్‌కు అభినందనలు తెలిపారు.

టీడీసీఏకు ఎంపిక



రాజు



అఖిల్

కడప కార్పొరేషన్ : తెలంగాణ డెఫ్ క్రికెట్ అసోషియేషన్(టీడీసీఏ) వైస్ కెప్టెన్‌గా కడప నగరానికి చెందిన బిర్లా రాజు, కోచ్‌గా మెల్లా అఖిల్ ఎంపికయ్యారు. ఈనెల 25వ తేదీ నుంచి అక్టోబర్ 1 వరకు ఒడిస్సాలోని భువనేశ్వర్‌లో జరుగనున్న ఐడీసీఏ ఏడో టీ20 నేషనల్ క్రికెట్‌కు వారు ఎంపిక కావడం పట్ల పలువురు క్రీడాకారులు, క్రీడాభిమానులు అభినందించారు. ఈ సందర్భంగా రాజు, అఖిల్ మాట్లాడుతూ తమను తెలంగాణ డెఫ్ క్రికెట్‌కు ఎంపిక చేసిన క్రికెట్ అసోషియేషన్ కార్యదర్శి రాజారాంకు కృతజ్ఞతలు తెలిపారు.

నాడు తడబడి.. నేడు సగర్వంగా నిలబడి!

బడి నుంచి అమ్మ ఒడి దాకా..
గజిబిజి గది నుంచి..
డిజిటల్ ఒరవడి దాకా..
ప్రభుత్వ విద్యారంగంలో
సంస్కరణల విప్లవమే జరిగింది.
గోడకు పూసిన నల్ల పోయి..
తెల్లని బోర్డు ప్రత్యక్షమైంది.
వానొస్తే.. చెట్ల కింద చదువు
ఎప్పుడో మాయమైంది.
మంచి కుట్టుబట్టలు..
చక్కనైన బూట్లు ఒంటిపై చేరాయి.
పిల్లలకు వేళకు భోజనం అందుతోంది..
సాంకేతిక విద్యా బోధన
మరింత దగ్గరైంది.. చూస్తుండగానే
బడి విజ్ఞాన ఒడిగా మారింది..
పేదల బిడ్డల్నే కాదు ప్రభుత్వ
ఉద్యోగుల పిల్లల్నీ ఆకర్షిస్తోంది.
గదిలోని రంగురంగుల బల్లల్లో..
అమ్మ ఒడిలో మల్లె..
పిల్లలు చక్కగా ఒదిగిపోవడం చూసి
బడి మురిసిపోతోంది. వెరసి..
ఒకప్పటిలా తడబడి కాదు..సరస్వతీ
నిలయమై సగర్వంగా నిలబడింది..



మదనపల్లె సిటీ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలో జరిగిన అభివృద్ధికి అక్కడ విద్యాబోధన చేసే ఉపాధ్యాయులే సాక్ష్యం. విద్యా రంగంలో సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ముఖ్యంగా నాడు– నేడు పేరుతో బడికి కార్పొరేట్ హంగులే కాదు మెరుగైన డిజిటల్ బోధన అందుబాటులోకి వచ్చింది. ఆంగ్ల మాధ్యమం కొత్త పరవళ్లు తొక్కుతోంది. దీంతో ప్రభుత్వ ఉపాధ్యాయుల్లోనూ మార్పు మొదలైంది. తమ పిల్లలను ప్రైవేటు బడులకు పంపే స్థోమత ఉన్నా.. తాము బోధన చేసే ప్రభుత్వ బడికే జై కొడుతున్నారు. ప్రభుత్వ చిత్తశుద్ధే ఈ మార్పునకు కారణమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ బడుల్లో తమ పిల్లలను చదివిస్తున్న ఉపాధ్యాయులపై కథనం.

• ప్రభుత్వ బడి తక్కువేం కాదు



కుమార్తె హలీమాతో మహమ్మద్‌ఖాన్

మదనపల్లె పట్టణం మోతీనగర్‌కు చెందిన పఠాన్ మహమ్మద్‌ఖాన్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇంగ్లీషు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తన కుమార్తె హలీమా సాదియాను ఇదే పాఠశాలలో పదో తరగతిలో చేర్పించారు. తాము చదువు చెప్పే బడిలోనే తమ పిల్లలను చదివిస్తే ఇతరులకు కూడా ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరుగుతుందన్నారు. చదువులతో పాటు క్రీడలు, క్రమశిక్షణకు మారుపేరైన ఎన్‌సీసీ ఈ పాఠశాలలో ఉందన్నారు.

• నాణ్యమైన విద్యా బోధన

మదనపల్లె పట్టణానికి చెందిన నామా చంద్రశేఖర్ బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లో మ్యాథ్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తన కుమారుడు ధీరజ్‌ను మదనపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతిలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన జరుగుతోందన్నారు.పైగా విద్యార్థులకు స్వేచ్ఛాయుత వాతావరణం ఉండటంతో అభ్యసనాభివృద్ధి జరుగుతుంది. వారి సర్వతోముఖాభివృద్ధికి వాతావరణ ఏర్పడుతుందన్న నమ్మకంతో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు ఆయన గర్వంగా తెలిపారు.



• ప్రభుత్వ చదువులే బెస్ట్



కుమారుడు కార్తీకేయతో వరప్రసాద్

మదనపల్లె పట్టణం కృష్ణానగర్ జుడీషియల్ కాలేజీకి చెందిన కంభం వరప్రసాద్ జెడ్పీహెచ్‌ఎస్‌లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. తన కుమారుడు కార్తికేయను పదో తరగతిలో చేర్పించారు. పాఠశాలల్లోనే నాణ్యమైన చదువు ఉందని అంటున్నారు. ఇంగ్లీషు మీడియం చదువులతో పాటు క్రీడలు, ఎన్‌సీసీలో కూడా ప్రవేశం ఉండటంతో తన కొడుకుని ఇక్కడే చదివిస్తున్నట్లు సంతోషంగా తెలిపారు.

• సకల సౌకర్యాలు



కీర్తనతో పాటు బడికి వస్తున్న సుధాకర్

మదనపల్లె మండలం ఆరోగ్యవరానికి చెందిన గుడిబండ సుధాకర్ మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తన కుమార్తె గుడిబండ కీర్తనను ఈ ఏడాది 8వ తరగతిలో జెడ్పీహెచ్‌ఎస్‌లో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు ధీటుగా సౌకర్యాలు బాగున్నాయి. అందుకే తన కుమార్తెను ఇక్కడే చదివిస్తున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు.

• విద్యతో పాటు ఆటల్లోనూ..



కొడుకు కౌషిక్‌తో టీచర్ మోహన్

మదనపల్లెకు చెందిన ఆలం మోహన్ మున్సిపల్ హోప్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తన కుమారుడు కౌషిక్‌ను పదో తరగతిలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యాబోధనతో పాటు క్రీడల్లో తర్ఫీదు ఇస్తుండటంతో తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. విద్యతో పాటు అన్ని సౌకర్యాలు బాగున్నాయని కితాబిచ్చారు.

అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలి

కలెక్టర్ గిరీషా పీఎస్



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : 'జగనన్నకు చెబుదాం–స్పందన' కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్‌ఓ సత్యనారాయణ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఈ నెలలో గాలివీడు, కెవి పల్లి, పెనగలూరు, నిమ్మనపల్లి మండల కేంద్రాలలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి వచ్చిన అర్జీలను తదుపరి వారంలోగా తప్పనిసరిగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఆరోగ్య సురక్షను విజయవంతం చేద్దాం

జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష, వాహనమిత్ర, జగనన్నతోడు ఈకేవైసీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ఉంటాయన్నారు. సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు వాలంటీర్ల సహకారంతో ఇంటింటి సర్వే నిర్వహించి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్‌లు తప్పనిసరిగా పంపిణీ చేయాలన్నారు. ఇంటింటి సర్వేలో సాధారణ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణీలు, బాలింతలు తగిన బరువు లేని పిల్లలను గుర్తించి వైద్యశిబిరానికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్నతోడు, వాహణ మిత్ర, వైఎస్ఆర్ చేయూత ఈకేవైసీ చేయించకపోతే తర్వాత లబ్ధిదారులు ఆ పథకాలకు అనర్హులవుతారన్నారు. లబ్ధి పొందిన వారందరి నుంచి ఈకేవైసీ చేయించాలన్నారు.

సేవలకు సత్కారం

- రైతు రుణాలు మెండుగా.. డిపాజిట్లు దండిగా
- జాతీయస్థాయిలో డీసీసీబీ అత్యుత్తమ బ్యాంక్‌గా ఎంపిక
- నేడు జైపూర్‌లో అవార్డు ప్రదానం



డీసీసీ బ్యాంకు

కడప అగ్రికల్చర్ : డీసీసీబీ అధికారుల కష్టానికి తగిన ఫలితం దక్కింది. ప్రణాళిక రచించడమే కాదు.. పనిలో సమిష్టిగా కదలడంతో అనుకున్నది సాధించారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ బ్యాంకుగా గుర్తింపు పొంది నేడు జైపూర్‌లో చైర్‌పర్సన్‌తోపాటు, బ్యాంకు సీఈఓ అవార్డును అందుకోనున్నారు. అటు వినియోగదారులకు సకాలంలో సేవలందించడంతోపాటు అన్ని రకాల వర్గాలకు విరివిగా రుణాలను అందించారు. దీంతోపాటు ఏళ్ల నుంచి పేరుకపోయిన మొండి బకాయిల వసూళ్లను కూడా అదేస్థాయిలో రాబట్టారు. ఫలితంగా ఎన్నో ఏళ్ల నుంచి నష్టాల బాటలో ఉన్న బ్యాంకు నేడు లాభాల బాట పట్టించారు.

జాతీయస్థాయిలో మెరిసిన కడప డీసీసీ బ్యాంకు...

జాతీయస్థాయిలో అన్ని జిల్లా బ్యాంకుల పనితీరు ఆధారంగా అప్పుల అభివృద్ధి, వసూళ్ల, మూలధనం మొదలగు అన్ని రకాల ప్యారామీటర్స్ ఆధారంగా నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కార్పొరేషన్ బ్యాంక్స్ లిమిటెడ్(ఎన్ఏఎఫ్ఎస్‌సిఓబి) ప్రతి ఏటా అత్యుత్తమ బ్యాంకును ఎంపిక చేసి అవార్డు ఇస్తుంది. ఇందుకుగాను 2021–22 సంవత్సరానికి ఈ ప్యారామీటర్స్ అధారంగా కడప డీసీసీ బ్యాంకు అత్యుత్తమ బ్యాంకుగా ఎన్నికయింది. ఇందులో డిపాజిట్లు సేకరణకు సంబంధించి 2020–21లో 215 కోట్లు ఉండగా.. 2021–22 ఏడాదికి 284.90 కోట్లకు పెంచారు. అలాగే డిపాజిట్ల సేకరణకు సంబంధించి రూ.390 కోట్లను 495 కోట్లకు పెంచారు. అలాగే అన్ని రకాల రుణాల మంజూరుకు సంబంధించి 967.75 కోట్ల నుంచి 1599.09 కోట్లకు పెంచారు. అలాగే మొండి బకాయిల్లో భాగంగా అగ్రికల్చర్‌కు సంబంధించి 85 కోట్లు బకాయిను 52.99 కోట్లుకు తగ్గించారు. అలాగే నాన్ అగ్రికల్చర్‌కు సంబంధించి రూ. 5.44 కోట్లు ఉన్న బకాయిలను 3.44 కోట్లుకు తగ్గించారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

నేడు అవార్డు ప్రదానం..

ఈ అవార్డును నేడు జైపూర్‌లో కడప డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, కడప డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్‌లు సంయుక్తంగా అందుకోనున్నారు.

చాలా సంతోషంగా ఉంది



కడప డీసీసీ బ్యాంకు జాతీయస్థాయిలో అత్యుత్తమ బ్యాంకుగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. ఇందుకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి ఎంతో కృషి చేశారు. బ్యాంకు అధికారులు సిబ్బంది కూడా అదేస్థాయిలో కష్టపడ్డారు. ఇందుకు చాలా సంతోషంగా ఉంది. బ్యాంకు మరింత అభివృద్ధి బాటలో నడిపించేందుకు అందరి సహకారంతో మరింత కృషి చేస్తాం. – కందుల రాజేంద్రకుమార్, సీఈఓ, డీసీసీ బ్యాంకు, కడప.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఆకేపాటిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత జిల్లా కనుక రాష్ట్ర దృష్టి అంతా ఇక్కడే ఉంటుందన్నారు. చిన్న పొరపాటుకూడా జరగకుండా జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందన్నారు. జెడ్పీలో పాలకవర్గం, ప్రతిపక్షం వైఎస్సార్ సీపీదేనని చెప్పారు. విమర్శ ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి నీట మునిగిన పది గ్రామాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశం మేరకు తాగునీరు, రహదారులు జెడ్పీ నిధులతో ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో రహదారులు, సీపీడబ్ల్యూఎస్ పథకాలు కల్పించామన్నారు. మిగతా జిల్లాల్లో లేని విధంగా అనేక మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. పలువురికి పదోన్నతులు కల్పించామన్నారు. జెడ్పీ కొత్త భవనం నిర్మించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని వెల్లడించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించానని తెలిపారు. తనకు రాజకీయ స్ఫూర్తి వైఎస్ఆర్ అని చెప్పారు. తాను ఏనాడూ పదవుల కోసం పాకులాడలేదన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీఎల్‌డీఓ వెంకట సుబ్బయ్య, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, జెడ్పీ ఏఓ రంగాచార్యులు మాట్లాడుతూ చైర్మన్‌గా ఆకేపాటి బాధ్యతలు చేపట్టాక 74 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించారన్నారు. అలాగే 70 మందికి పదోన్నతులు కల్పించారన్నారు. త్వరలో మరో 50 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగ అవకాశాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, జెడ్పీటీసీలు సుబ్బయ్య, శ్రీకాంత్, వీఎన్ పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నకేశవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పక్కనే పేలుళ్లు



క్వారీ నుంచి దుమ్ము లేచిన దృశ్యం

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారి పక్కనే కంకర కోసం మైనింగ్‌లో పేలుళ్ల నిర్వహిస్తుండటంతో.. పెద్ద శబ్దాలకు వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. మంగంపేట ఏపీఎండీసీ గనుల సమీపంలో గోవిదంపల్లె పంచాయ తీ పరిధిలోని కొండను తవ్వి పెద్ద ఎత్తున పేలుళ్ల నిర్వహించి పనులు చేపడుతున్నారు. దీంతో జాతీయ రహదారిపైకి పెద్ద ఎత్తున దుమ్ము దూళితోపాటు శబ్దాలు రావడంతో పెద్ద రాళ్లు తమపై పడతాయేమోనని వాహనదారులు భయపడుతున్నారు. ఖనిజం తరలించే వాహనాలు అధికమై పెద్ద ఎత్తున దుమ్ము దూళి చేరుతోంది. ఏపీఎండీసీ గనుల సమీపంలో రెండు వందల మీటర్లు డేంజర్ జోన్‌గా ప్రకటించారు. 60 మీటర్లలోపు మైనింగ్‌కు అనుమతులు ఏ విధంగా ఇచ్చారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని గోవిందంపల్లె వాసులు కోరుతున్నారు.

30లోగా నామినేషన్లు ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం

రాయచోటి : ఇన్‌స్పైర్ నామినేషన్లను ఈనెల 30వ తేదిలోగా జిల్లాలోని అన్ని పాఠశాలలు నామినేషన్లు సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం తెలిపారు. సోమవారం రాయచోటిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్‌లకు ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో పురుషోత్తం మాట్లాడుతూ ఇన్‌స్పైర్ నామినేషన్‌ల సమర్పణలో అన్నమయ్య జిల్లాను అగ్రస్థానంలో ఉంచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు చాలా వెనుకబడ్డాయని డీఈఓ ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఆదేశాలను అమలు పరచడంలో నిర్లక్ష్యం తగదన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఓబులరెడ్డి మాట్లాడారు. మండల విద్యాశాఖ అధికారులు బాలాజీ, వెంకట శివారెడ్డి, కరిముల్లా, ఏఎస్ఓ నాగేంద్రరెడ్డి, సీఆర్‌పీలు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్‌లు, ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశప్రగతికి తోడ్పాటునందివ్వాలి

రాయచోటి అర్బన్ : దేశప్రగతికి ప్రతిఒక్కరూ తమవంతు తోడ్పాటునందివ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం అన్నారు. నామట్టి – నాదేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులతో కలసి ఆయన పురవీధులలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాదేశం– నామట్టి కార్యక్రమంలో భాగంగా సెప్టెంబరు 25నుంచి 28వరకు వ్యాసరచన, కథలు చెప్పడం, పాటలు, నాటికలు, రంగవల్లులు, ఫ్యాన్సీ డ్రస్ కాంపిటీషన్ లను అన్ని పాఠశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొ న్నారు.

క్లుప్తంగా

మద్యం మత్తులో..

పురుగుల నివారణ మందు తాగి యువకుడి మృతి

మదనపల్లె : మద్యం మత్తులో ఓ యువకుడు పురుగుల నివారణ మందు తాగి మృతి చెందాడు. రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సుధాకర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పోతబోలు పెద్దచెన్నయ్యగారి పల్లెకు చెందిన కదిరప్ప కుమారుడు నరసింహులు(35) ఈ నెల 21న మద్యం మత్తులో పురుగుల నివారణ మందు తాగాడు. అస్వస్థతకు గురైన అతన్ని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ.. ఆదివారం మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు సోమవారం పోస్టుమార్టం నిర్వహించి వారికి అప్పగించారు.

ఆటో, బైక్ ఢీకొని..


గాయపడిన కార్తీక్

ములకలచెరువు : ఆటో, బైక్ ఢీకొని ఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం కంచికి చెందిన కార్తీక్(26) కొంత కాలంగా ములకలచెరువులో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. పనుల మీద మదనపల్లెకు వెళ్లి తిరిగి బైక్ వస్తుండగా.. బురకాయలకోట సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో కార్తీక్‌కి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 సాయంతో ములకలచెరువు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు తిట్టారని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : తల్లిదండ్రులు తిట్టారన్న మనస్తాపంతో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు, కుటుంబ సమస్యలతో మరొకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలు సోమవారం జరిగాయి. గుర్రంకొండ మండలం సుంకరవాండ్లపల్లెకు చెందిన చలపతి కుమారుడు సుమన్(30) తల్లిదండ్రులు తిట్టారని ఇంట్లోనే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె మండలం బండమీదపల్లెకు చెందిన గంగులప్ప కుమార్తె మౌనిక తల్లిదండ్రులు మందలించారని, నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. మదనపల్లె మండలానికి చెందిన గోపి భార్య వల్లి(55) కుటుంబ సమస్యలతో మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. బాధితులను కుటుంబసభ్యులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నిరంతర పర్యవేక్షణ... ప్రజలకు రక్షణ

- సత్ఫలితాలిస్తున్న కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థ
- 24/7 విధుల్లో బ్లూకోల్ట్స్, రక్షక్ పోలీస్ సిబ్బంది
- ఎల్‌హెచ్ఎంఎస్, సీసీ కెమెరాలతో నిఘా
- అందుబాటులో డయల్ 100 అత్యవసర సేవలు



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వీడియోవాల్‌లో సీసీ కెమెరాల ఎల్ఈడీ మానిటర్స్

కడప అర్బన్ : జిల్లాలో శాంతిభద్రతలను పోలీస్ శాఖ నిరంతరం పర్యవేక్షణ చేసి, ప్రజలకు రక్షణ కల్పిస్తోంది. ఇందుకోసం కడపలో ఏర్పాటు చేసిన కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థ సత్ఫలితాలు ఇస్తోంది. జిల్లాలోని కడప నగరంతోపాటు ప్రతి సబ్ డివిజన్ పరిధిలో ప్రజలకు అందుబాటులో 24/7 వుండి, వారి సమస్యల సమాచారం అందుకున్న వెంటనే నిమిషాల్లో సంఘటన స్థలాలకు చేరుకుని పరిష్కరించేందుకు ఈ వ్యవస్థను రూపొందించారు. జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో కడపలోని డీఎస్పీ కార్యాలయంలో 2017 అక్టోబర్ 23న అప్పటి కర్నూలు-కడప రేంజ్ డీఐజీ చేతుల మీదుగా ప్రారంభించారు. రోజూ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 9 వరకు, రాత్రి 9 నుంచి ఉదయం 7 గంటల వరకు మూడు షిఫ్టులలో పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు.

పకడ్బందీగా బ్లూకోల్ట్స్, రక్షక్ విధులు

కడపలో 13 బ్లూకోల్ట్స్ , 4 రక్షక్‌లు నిరంతరం అందుబాటులో వుంటాయి. ప్రతి బ్లూకోల్ట్స్ ద్విచక్ర వాహనంలో పోలీస్ కానిస్టేబుల్, హోంగార్డు, రక్షక్ వాహనంలో పోలీస్ అధికారితోపాటు కానిస్టేబుల్, సిబ్బంది విధుల్లో వుంటారు. ప్రతి షిఫ్టునకు 34 మంది సిబ్బంది విధుల్లో వుంటారు.

■ వీరంతా తాము విధులను నిర్వర్తించే సమయంలో ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణ, లా అండ్ ఆర్డర్ సమస్యలు, వీఐపీ బందోబస్తు కార్యక్రమాలు, ఉపద్రవ కేసులు, బాధల్లో వున్న కాలర్‌లకు హాజరు కావడం, డయల్-100 కాల్స్, నైట్ పెట్రోలింగ్‌కు హాజరు కావడం, ఈవ్‌టీజింగ్ నియంత్రణ, తాళం వేసిన ఇంటి జాబితా సేకరణ, తాళం వేసిన ఇళ్ల భద్రతను పర్యవేక్షించడం, జాతరలు, పండుగలు, మార్నింగ్ వాకింగ్‌లో వాకర్స్‌కు రక్షణ, బ్యాంకులు, ఇతర వ్యాపార సంస్థల వద్ద రక్షణ రద్దీగా వుండే ప్రాంతాల్లో క్రౌడ్ కంట్రోల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్ చేస్తారు. మార్నింగ్ వాకర్స్ పాఠశాలలు, కార్యాలయాలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలు, కాలనీల్లో సందర్శించి సీనియర్ సిటిజన్‌లతో సమస్యలపై చర్చిస్తారు. విజిబుల్ పోలీసింగ్, ట్రాఫిక్ జంక్షన్‌లు, హాస్టల్ విద్యార్థులు, వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్ సందర్శించడం, దుకాణాలు మూసివేయడం, మద్యం మత్తులో వున్న వారికి డ్రంకన్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుంటారు. సినిమా థియేటర్లు సందర్శించడం, లాడ్జీలు తనిఖీ చేస్తుంటారు.

జిల్లాలో సబ్ డివిజన్‌ల వారిగా దిశ కోల్ట్స్ సిబ్బంది వివరాలు	
సబ్ డివిజన్	దిశ టూవీలర్స్
కడప	16
పులివెందుల	13
ప్రొద్దుటూరు	9
జమ్మలమడుగు	11
మైదుకూరు	15
మొత్తం	64

వీడియో వాల్ సిబ్బంది..

ప్రతి షిఫ్టునకు పోలీస్ కానిస్టేబుల్ చొప్పున ముగ్గురు కానిస్టేబుల్స్ వుంటారు. వీరు వివిధ ఛానెల్‌లలో కమ్యూనికేషన్‌ను గమనించడం, సంఘటనలను లాగ్‌బుక్‌లో రాయడం చేయాలి. డ్యూటీ ఆఫీసర్ల వివరాలను సేకరించి రిజిస్టర్‌లలో నమోదు చేస్తారు. వీహెచ్ఎఫ్ సెట్‌లు, మ్యాన్‌ప్యాక్‌లు, ట్యాబ్‌లు, బ్యాటరీ నిర్వహణను పర్యవేక్షించాలి. ఇంధన నిర్వహణ, ఇంధన నిర్వహణ కోసం ప్రత్యేక రిజిస్టర్‌ను ఏర్పాటు చేయాలి.

లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్

2017 జూలై 18న అప్పటి జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ఎంఎస్)ను ప్రారంభించారు. విస్తృత ప్రచారం ద్వారా జిల్లా మొత్తం ఈ విధానం నడుస్తోంది. కడప నగరంలో ఎల్‌హెచ్ఎంఎస్ విధానం విజయవంతంగా సాగుతోంది. ఇటీవల కొన్ని కేసుల్లో ఎల్‌హెచ్ఎంఎస్ ద్వారా నేరస్తులను పట్టుకున్నారు. ఈ విధానం అమలుకు ప్రతి షిఫ్టునకు ఒక కానిస్టేబుల్ చొప్పున ముగ్గురు కానిస్టేబుళ్లు 24/7 విధుల్లో వుంటారు. వీరు ప్రధానంగా ఎల్‌హెచ్ఎంఎస్ డాష్‌బోర్డ్ నిర్వహణ, ఎల్‌హెచ్ఎంఎస్ వినియోగదారుల రిజిస్ట్రేషన్‌లు, అభ్యర్థనలపై పరిశీలన, సిస్టమ్, సాఫ్ట్‌వేర్ నిర్వహణ, ఎల్‌హెచ్ఎంఎస్ వినియోగదారుల కోసం కెమెరాలను పంపిణీ చేయడం, సేకరించడం, కనెక్టివిటీ నిర్వహణ, లాక్ చేసిన ఇంటి డేటాను అప్లికేషన్‌లో నమోదు చేయడం, ఎల్‌హెచ్ఎంఎస్ తాళం వేసిన ఇంటి డీఎస్ఆర్ సమర్పణ, సీసీ కెమెరాల లెన్స్‌లను శుభ్రపరచడం, ఎస్‌వీఆర్ వేలాడుతున్నపుడు, కెమెరాలు ప్రదర్శించనపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీసీ టీవీ విజువల్స్ రికార్డ్ కాకపోతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అమర్చిన కెమెరాల గురించి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు తెలియజేయడం, ఏదైనా సమస్య వుంటే 24/7 హెచ్చరించడం, బ్లూకోల్ట్స్ తనిఖీల కోసం తాళం వేసిన ఇళ్ల చెక్ లిస్ట్‌ను అందించడం వీరి విధుల్లో ప్రధానమైనవి.

జిల్లా వ్యాప్తంగా వున్న రక్షక్, బ్లూకోల్ట్స్, మూడు షిఫ్టుల సిబ్బంది వివరాలు					
సీసీ సెంటర్	ప్రారంభ తేదీ	రక్షక్‌లు	బ్లూకోల్ట్స్	3 షిఫ్టులు	ఇన్‌చార్జిలు
కడప	23.10.2017	4	13	102	సీఐ, ఇద్దరు ఎస్ఐలు
పులివెందుల	12.11.2019	1	3	24	ఎస్ఐ
ప్రొద్దుటూరు	12.11.2019	3	8	66	సీఐ, ఎస్ఐ
జమ్మలమడుగు	2.11.2019	2	3	30	ఎస్ఐ
మైదుకూరు	31.5.2021	2	3	30	ఎస్ఐ
బద్వేల్	2.4.2018	1	3	24	ఎస్ఐ
పోరుమామిళ్ల	-	0	2	12	ఎస్ఐ
ఎర్రగుంట్ల	-	1	3	24	ఎస్ఐ
మొత్తం	8 సెంటర్లు	14	38	312	11 మంది

డయల్ 100/112 సిబ్బంది పనితీరు

ఈ విధానం అమలుకు ప్రతి షిఫ్ట్ డ్యూటీకి ముగ్గురు పోలీస్ కానిస్టేబుళ్ల చొప్పున 9 మంది కానిస్టేబుళ్లు విధుల్లో వుంటారు. వీరు ప్రధానంగా కాల్స్‌ను స్వీకరించి, అవసరమైన చర్యలు తీసుకోవడానికి సంబంధిత అధికారులకు తెలియజేయాలి. రిజిస్టర్‌లలో కాల్స్ వివరాలను నమోదు చేయాలి. స్వీకరించిన కాల్స్ కోసం సంబంధిత అధికారులతో సంప్రదించాలి. డయల్ 110/112 వెబ్ అప్లికేషన్‌లో ప్రత్యుత్తరం ఇవ్వాలి. డయల్ 100/112 నుంచి కాల్స్ వచ్చిన తరువాత నేర స్థలాన్ని సందర్శించే అధికారులకు డయల్ 100 సిబ్బంది సహకరించాలి. ప్రజల నుంచి ఏదైనా తప్పుడు ఫిర్యాదు అందినట్లయితే, భవిష్యత్తులో అలాంటి కార్యకలాపాలు జరగకుండా వుండేందుకు వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ప్రత్యేక కౌన్సెలింగ్‌ను నిర్వహించడంతో పాటు, వారి వివరాలను ప్రత్యేక డీఎస్ఆర్ నిర్ణీత ఫార్మాట్‌లో ఉన్నతాధికారులకు పంపించాలి.

దిశ కోల్ట్స్ డ్యూటీలు

కడప కమాండ్ కంట్రోల్ 9 మంది దిశ కోల్ట్స్ మహిళా పోలీస్ కానిస్టేబుల్స్ వున్నారు. వీరు ప్రధానంగా విధులు, పాఠశాలలు, కళాశాలలు, రైల్వే స్టేషన్‌లను తరచుగా సందర్శించడం, కుటుంబ సమస్యల కేసులకు హాజరు కావడం, డయల్ 100 కాల్స్, మహిళల బాధాకరమైన కాల్‌లకు హాజరు కావడం, ఈవ్‌టీజింగ్ నియంత్రణ, వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్, పార్కులు, షాపింగ్ మాల్స్, జాతరలు, పండుగల సమయంలో తరచుగా దేవాలయాలను సందర్శించడం, దిశ యాప్ డౌన్‌లోడ్ చేసి, దిశయాప్‌పై అవగాహన కల్పించడం, అత్యవసర విధులకు హాజరయ్యే సమయంలో ఎస్పీ కార్యాలయం, ఎస్‌డీపీఓ కార్యాలయం సూచనల ప్రకారం నడచుకోవాలి.

నేరాల నియంత్రణకు చర్యలు

జిల్లాలో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తోపాటు, రక్షక్, బ్లూకోల్ట్స్, దిశ బ్లూకోల్ట్స్, సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ, ఎల్‌హెచ్ఎంఎస్, డయల్ 100/112 వ్యవస్థలను పటిష్టంగా నిర్వహిస్తున్నాం. ప్రజలకు నిరంతరం అందుబాటులో వుండి, నేరాల నియంత్రణకు పాటుపడతాం. వ్యాపారులు, ఇతర కేటగిరిలలోని ప్రజలు తమ వంతు బాధ్యతగా తమ పరిధిల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే మంచిది.

– ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, వైఎస్ఆర్ జిల్లా

బతుకుదెరువు కోసం వెళ్లి.. తిరిగిరాని లోకాలకు..


శివకుమార్ (ఫైల్)

పుల్లంపేట : బతుకుదెరువు కోసం వెళ్లిన ఓ వ్యక్తి తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. దీంతో కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కుమారునిపల్లి దళితవాడకు చెందిన రాజబోయన శివకుమార్ (51) జీవనోపాధి నిమిత్తం ఐదేళ్ల క్రితం గల్ఫ్ దేశమైన కువైట్ వెళ్లాడు. అక్కడ ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. వీరిది రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. శివకుమార్ భార్య రామసుబ్బమ్మ కూలీ పనులకు వెళ్తోంది. వారికి ఒక కుమార్తె ఉంది. శివకుమార్ మృతదేహం కోసం బాధిత కుటుంబం ఎదురుచూస్తోంది. అక్కడి నుంచి తీసుకురావడానికి వీరి దగ్గర ప్రయాణ ఖర్చులకు కూడా డబ్బులు లేవు. ఎలాగైనా తమ భర్త మృతదేహాన్ని తీసుకురావాలని భార్య కోరుతోంది. ఏపీఎన్ఆర్ఎస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో పంపించాలని రాజంపేట పార్లమెంటు సభ్యుడు ఎంపీ మిథున్‌రెడ్డి, రైల్వేకోడూరు శాసనసభ్యుడు కొరముట్ల శ్రీనివాసులును ఆమె వేడుకుంటోంది.

బంగారు అపహరించారనే అనుమానంతో కేసు

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి టౌన్‌లో ఓ బంగారు షాపులో ముగ్గురు మహిళలు బంగారును అపహరించారనే అనుమానంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ముగ్గురు మహిళలు ఓ బంగారు షాపులో కొత్త కమ్మలు కొన్నారని ఆయన పేర్కొన్నారు. అయితే అదే సందర్భంలో ఒక బాక్స్‌లో వారి పాత కమ్మలు పెట్టి, కొత్తవి తీసుకెళ్లారని బంగారు షాపు యజమాని ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

సమాజ సేవకు పాటుపడదాం


రోటరీ నూతన కార్యవర్గంతో మాజీ గవర్నర్ చిన్నపరెడ్డి, సహాయ గవర్నర్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : రోటరీ క్లబ్ ఆఫ్ అన్నమయ్య ద్వారా సమాజ సేవకు పాటుపడదామని జెడ్పీ చైర్మన్, రోటరీ క్లబ్ ఆఫ్ అన్నమయ్య సహాయ గవర్నర్ ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్వీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి రోటరీ క్లబ్ ఆఫ్ అన్నమయ్య నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న రోటరీ క్లబ్ ఆఫ్ అన్నమయ్య మాజీ గవర్నర్ చిన్నపరెడ్డి, సహాయ గవర్నర్ ఆకేపాటి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నూతన కార్యవర్గం చేత ప్రమాణం స్వీకారం చేయించి, సన్మానించారు. అదే విధంగా చిన్నపరెడ్డిని, ఆకేపాటిని నూతన కార్యవర్గ సభ్యులు సన్మానించి, వారి వద్ద ఆశీర్వాదం పొందారు. అనంతరం చిన్నపరెడ్డి, ఆకేపాటి మాట్లాడుతూ సేవ చేయడంలో రోటరీ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరం రోటరీ ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకేపాటి మురళీరెడ్డి, పోలా వెంకటరమణారెడ్డితోపాటు క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

అధ్యక్షుడిగా నాగా చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా రేనాటి రాఘవేంద్రవర్మ, కోశాధికారిగా మిరియం శ్రీనివాసులు యాదవ్, సభ్యులుగా ఏబీ మహేష్‌రెడ్డి, ఓ.శివారెడ్డి, నాగా పృథ్వీపతిరెడ్డి, వెంకటరెడ్డి, పాపినేని విశ్వనాథరెడ్డి, నాగా హరినాథరెడ్డి, ఎం.శ్రీనివాసులుగౌడ్, పేరకం శంకరశెట్టి, గొబ్బిళ్ల త్రినాథ్, మాధవరం అనీల్, నాగా పిచ్చిరెడ్డి, విశ్వనాథ్, సంగీత సుబ్బరాయుడును నియమించారు.

ఫిర్యాదిదారులకు సత్వర న్యాయం అందించాలి


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ క్రిష్ణారావు

రాయచోటి : 'స్పందన' ద్వారా అందిన ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ బి.క్రిష్ణారావు జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటిలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ నేరుగా స్వీకరించి ప్రజలతో మమేకమయ్యారు. ప్రజలు అందించిన వివిధ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపి సత్వర న్యాయం చేకూర్చాలన్నారు. స్పందన ద్వారా 50 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. జిల్లాలోని పోలీసు అధికారులు ఆయా అర్జీలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలోగా విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

లింగాల : మండల పరిధి మురారిచింతల గ్రామంలో బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. ఇంటర్మీడియెట్ చదువుతున్న 16 ఏళ్ల బాలికకు వివాహం చేయడానికి కుటుంబ సభ్యులు, బంధువులు నిశ్చయించారు. విషయం తెలుసుకున్న మండల అధికారులు మురారిచింతల గ్రామానికి వెళ్లారు. బాలిక, తల్లిదండ్రులు, బంధువులను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చారు. తహసీల్దార్ లక్ష్మినారాయణ, హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. 18 ఏళ్లు నిండే వరకు వివాహం చేయబోమని తల్లిదండ్రులు, వారి బంధువులతో అంగీకార పత్రాన్ని రాయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి, డిప్యూటీ తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి వ్యక్తి మృతి


శ్రీనివాసులు (ఫైల్)


పెన్నా నుంచి శ్రీనివాసులును బయటికి తీసుకొస్తున్న అగ్నిమాపక రెస్క్యూ సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక రామేశ్వరం ప్రాంతానికి చెందిన నక్కా శ్రీనివాసులు (32) అనే వ్యక్తి పెన్నానదిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాసులు ఇటుకల బట్టీలో పని చేస్తుంటాడు. అతనికి భార్య నాగమ్మతోపాటు సూర్యప్రకాష్ అనే కుమారుడు, తహర్షిత అనే కుమార్తె ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత శ్రీనివాసులు మరో యువకుడితో కలిసి రామేశ్వరం సమీపంలోని ఆర్టీపీపీకి వెళ్లే దారిలో పెన్నానదిలోకి ఈతకు వెళ్లాడు. అతను నీటి గుంతలో ఈత కొడుతుండగా కొద్ది సేపటి తర్వాత గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక రెస్క్యూ సిబ్బంది జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి రఘునాథ్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లైఫ్‌బాయ్, లైఫ్‌జాకెట్ల సాయంతో నీళ్లలో ఉన్న శ్రీనివాసులును బయటికి తీశారు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రూరల్ ఎస్ఐ చిరంజీవి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్మీ సెలక్షన్స్‌లో ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విజయఢంకా


ఆర్మీ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులతో అకాడమీ చైర్మన్ శేషారెడ్డి

తిరుపతి రూరల్ : గుంటూరులో ఈ నెల 24న నిర్వహించిన ఆర్మీ సెలక్షన్స్‌లో తిరుపతి ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు వివిధ విభాగాల్లో విజయదుందుభి మోగించినట్లు అకాడమీ చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతిలోని అకాడమీలో ఆర్మీ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీ సెలక్షన్స్‌లో అకాడమీకి చెందిన 85 మంది విద్యార్థులు వివిధ విభాగాలకు ఎంపికైనట్లు తెలిపారు. టెక్నికల్-17, జీడీ-66, ట్రేడ్స్‌మెన్-2 ఇలా మొత్తం 85 మంది సెలక్ట్ అయినట్లు చెప్పారు. అకాడమీలో విద్యతో పాటు డిఫెన్స్‌లో ఉద్యోగాలు సాధించేందుకు శారీరక, మానసిక, సాంకేతిక, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు అకాడమీలో ఉచిత విద్యను అందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువకుడి దారుణ హత్య


పఠాన్ సద్దాం మృతదేహం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలో పఠాన్ సద్దాం (25) అనే యువకుడు సోమవారం సాయంత్రం బుగ్గవంక సమీపంలో దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన వివాహేతర సంబంధం వల్ల జరిగిందని భావిస్తున్నారు. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న పఠాన్ సద్దాం భార్య రవీంద్రనగర్‌కు చెందిన మహిళ. వీరికి ఇద్దరు సంతానం. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కడప తాలూకా సీఐ రాజా కేసు నమోదు చేశారు. ప్రాథమికంగా లభించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప నగరం రవీంద్రనగర్‌కు చెందిన సద్దాం, బాబా ఫక్రుద్దీన్ అలియాస్ బబ్లు, రాజేష్, మరో యువకుడు.. నలుగురూ స్నేహితులుగా ఉండేవారు. సద్దాం భార్యతో ఫక్రుద్దీన్ వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడని అనుమానం కలిగింది. ఈ క్రమంలో వారి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. రెండు నెలల క్రితం బాబా ఫక్రుద్దీన్ కువైట్‌కు వెళ్లి ఇటీవలే స్వదేశానికి తిరిగి వచ్చాడు. ఈ క్రమంలోనే బాబా ఫక్రుద్దీన్, రాజేష్‌లు సంఘటనా స్థలం వద్ద మద్యం సేవిస్తూ సద్దాంను, మరో స్నేహితుడిని పిలిపించారు. బాబా ఫక్రుద్దీన్, రాజేష్‌లు ఇద్దరూ కలిసి సద్దాంను గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. ఈ క్రమంలో సద్దాంతోపాటు వచ్చిన స్నేహితుడు పరారయ్యాడు. హత్య చేసిన తర్వాత బాబా ఫక్రుద్దీన్, అతని స్నేహితుడు రాజేష్‌లు పోలీసులకు చిక్కకుండా పరారయ్యారు. సద్దాం రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, తాలూకా సీఐ రాజా, తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ వెల్లడించారు.

మంగంపేట పునరావాస గ్రామస్తులకు సహకారం


మంగంపేట గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఏపీఎండీసీ ఎండీ

ఓబులవారిపల్లె : మంగంపేట పునరావాస గ్రామస్తులకు ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం విజయవాడ ఏపీఎండీసీ కార్యాలయంలో ఎండీ వీజీ వెంకటరెడ్డి.. మంగంపేట పునరావాస గ్రామస్తులు, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డిలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఏపీ టీడీసీ డైరెక్టర్ మాట్లాడుతూ మంగంపేట ఆర్ఆర్-1, ఆర్ఆర్-2, ఆర్ఆర్-3, ఆర్ఆర్-4 పునరావాస గ్రామస్తుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. 2012లో పెండింగ్‌లో ఉన్న 226 కుటుంబాలకు సంబంధించిన డీజెడ్‌ల సమస్యను పరిష్కరించాలన్నారు. పెండింగ్ సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ఎండీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీజెడ్‌ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మంగంపేట ఆర్ఆర్-2 అగ్రహారం తరలింపునకు రూ. 28 కోట్లు నిధులు కేటాయించడం జరిగిందని, ఇంకా ఏమైనా అవసరం ఉంటే అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. గ్రామస్తులకు నూతనంగా నిర్మించే ఆర్ఆర్-5లో మెరుగైన పునరావాసం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంగంపేట ఉపసర్పంచ్ కొలూరు మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొలూరు నారాయణరెడ్డి, గల్లా శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.లక్ష్మీనారాయణ, గల్లా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఓకు గాయాలు


గాయపడ్డ ఈశ్వరయ్య

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజంపేట మండలం ఊటుకూరుకు చెందిన వీఆర్ఓ ఈశ్వరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఓబులవారిపల్లె మండలం గాదెల వెంకటాపురం గ్రామానికి చెందిన ఈశ్వరయ్య రైల్వేకోడూరులో నివాసం ఉంటున్నాడు. రాజంపేటలో సోమవారం విధులు ముగించుకుని బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో.. ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయనకు గాయాలయ్యాయి. వెంటనే ఏపీఎండీసీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం రైల్వేకోడూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు.